పుడమి పులకించేలా..

నాలుగేళ్ల క్రితం ఎటు చూసినా కరువు ఛాయలే. అప్పట్లో ఏ గ్రామానికి వెళ్లినా తాగడానికి గుక్కెడు నీరు దొరకని పరిస్థితి. పశుగ్రాసం లేక పాడి పశువులు అల్లాడిపోయాయి. బతుకు దెరువు కోసం కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన పరిస్థితులు చూశాం. నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ధర్మవరం మండలంలో ఏ గ్రామానికి వెళ్లినా పొలాలు పచ్చని పంటలతో కనువిందు చేస్తున్నాయి. వరుసగా నాలుగేళ్ల పాటు కురిసిన వర్షాలకు భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. బోరు బావుల్లో పుష్కలంగా నీరు వస్తుండటంతో రైతులు నిశ్చితంగా పంటలు సాగు చేశారు. వేరుశనగ, కూరగాయల పంటలను పండించుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.

– ధర్మవరం రూరల్:


నీటితో కళకళలాడుతున్న రేగాటిపల్లి చెరువు


ముచ్చురామి పొలాల్లో సాగులో ఉన్న కూరగాయల పంటలు


రేగాటిపల్లి వద్ద బోరు నుంచి పుష్కలంగా వస్తున్న నీరు


రేగాటిపల్లి వద్ద సాగులో ఉన్న వేరుశనగ

బత్తలపల్లి మండలంలో ‘సైకిల్’

- వార్డు ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకే ప్రజల మద్దతు
- తంబాపురం 3వ వార్డు మెంబర్‌గా బ్యాళ్ల లక్ష్మీనారాయణమ్మ విజయ కేతనం


వార్డు సభ్యురాలు లక్ష్మీనారాయణమ్మను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

బత్తలపల్లి: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం వరకూ బత్తలపల్లి మండలంలో టీడీపీ హవా కొనసాగింది. బత్తలపల్లి మండలం అంటేనే తెలుగుదేశం పార్టీకి కంచుకోట అనే ముద్ర ఉండేది. అయితే వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం తరువాత టీడీపీ తుడిచిపెట్టుకుపోతోంది. స్థానిక సంస్థలకు జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి చెందిన వారికే ఎంపీపీ, జెడ్పీటీసీ పదవులు దక్కించుకున్నారు. తంబాపురం గ్రామ పంచాయతీలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌గా సానే జయచంద్రారెడ్డితో పాటు పది వార్డు స్థానాలను ఏకగ్రీవం చేసుకుంది. ఇక్కడ అప్పట్లో పోటీ చేయడానికి టీడీపీ ముందుకే రాలేకపోయింది. 3వ వార్డు మెంబర్‌గా ఏకగ్రీవం అయిన రాములమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. వైఎస్సార్‌సీపీ తరపున బ్యాళ్ల లక్ష్మీనారాయణమ్మ నామినేషన్ దాఖలు చేసింది. ఇక్కడ ఏ మాత్రం బలం లేకపోయినా పోటీకి ఎవ్వరూ ముందుకు రాకపోయినా కుటుంబ స్పర్థలను అడ్డుపెట్టుకుని టీడీపీ నాయకులు సొంత ఆడ బిడ్డపైనే (బ్యాళ్ల లక్ష్మీనారాయణమ్మ అన్న కేశన్న భార్య నారాయణమ్మను) పోటీ చేయించారు. దీంతో ఏకగ్రీవం కావాల్సిన స్థానానికి ఎన్నిక అనివార్యమైంది. ఆ తరువాత ప్రచారంలో సైతం లక్ష్మీనారాయణమ్మ కేవలం సర్పంచ్ సానే జయచంద్రారెడ్డితో పాటు స్థానిక నాయకులతో కలిసి ప్రచారం చేశారు. టీడీపీ మద్దతురాలైన నారాయణమ్మకు మద్దతుగా మండలంలోని టీడీపీ నాయకులందరూ వచ్చి ప్రచారం నిర్వహించారు. అయితే 3వ వార్డు మెంబర్‌గా బ్యాళ్ల లక్ష్మీనారాయణ విజయం సాధించింది. ఎంత మంది నాయకులైతే వచ్చి ప్రచారం చేశారో అన్ని ఓట్లు కూడా రాలేదని, వారు ఇక్కడ ఎందుకు పోటీ చేయించారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ప్రచార సమయంలోనూ మీరు నామినేషన్ ఎందుకు వేశారు? ఏమీ చేశారని ఓట్లు వేయాలంటూ నిలదీసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. గతంలో రెండు సార్లు జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయకేతనం ఎగురవేశారు. మండలంలో 13 సర్పంచ్ స్థానాలకు గాను 11 సర్పంచు స్థానాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించారు. అత్యధిక వార్డులను కైవసం చేసుకుని అన్ని పంచాయతీల్లోనూ ఉప సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పార్టీలు, మతాలు, కులాలు చూడకుండా అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తున్నారు. ప్రజలంతా వారి వెంటే ఉంటారని గ్రామస్తులు చెబుతున్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి


బత్తలపల్లి: పోట్లమర్రిలో నాగులకట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు

బత్తలపల్లి: మండలంలోని కోడేకండ్ల, ముష్టూరు, సంజీవపురం, అనంతసాగరం, ఎం.చెర్లోపల్లి, డి.చెర్లోపల్లి, పత్యాపురం, ఉప్పర్లపల్లి, దంపెట్ల, నెత్తివారంపల్లి, వేల్పుమడుగు, లింగారెడ్డిపల్లి, చెన్నరాయపట్నం, విశ్వనాథపురం, బత్తలపల్లి, పోట్లమర్రి తదితర గ్రామాల్లో ఆదివారం శ్రావణసందడి నెలకొంది. నాగులచవితిని పురస్కరించుకుని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో మహిళలు పూజలు చేపట్టారు. కుటుంబ సభ్యులతో తరలివచ్చి పుట్టల్లో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

తాడిమర్రి: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ప్రజలు నాగుల చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తాడిమర్రి, మద్దులచెర్వు, మోదుగులకుంట, పిన్నదరి, నిడిగల్లు, ఏకపాదంపల్లి, ఆత్మకూరు, పెద్దకోట్ల, చిల్లకొండయ్యపల్లి, దాడితోట తదితర గ్రామాల్లో పుట్టల్లో పాలు పోశారు. నాగులకట్టకు దారం చుట్టి ప్రదక్షిణలు చేశారు. అనంతరం మహిళలు చిన్నారులకు ప్రసాదం అందజేశారు.

పెద్దమ్మ దేవతకు ప్రత్యేక పూజలు


ముదిగుబ్బ: అలంకరణలో పెద్దమ్మ దేవత


ధర్మవరం అర్బన్: పూజలందుకున్న పెద్దమ్మ దేవత

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని పెద్దమ్మ దేవతకు ఆదివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా పెద్దమ్మ దేవతను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కోట కురుబవీధిలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు రోజులపాటు ఆలయంలో పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు, అలంకరణలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

క్లుప్తంగా

వైభవంగా వీరబయమ్మ పరుష


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని చిగిచెర్ల గ్రామంలో వీరబయమ్మ వీరశెట్టప్ప స్వాముల పరుషను ఆదివారం గుడికాపులు, బుడ్రా, దాసరి కులస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి జాతరలో పాల్గొని అమ్మవారికి పూజలు చేయించారు. అనంతరం ప్రసాదం స్వీకరించారు. ఈ పరుషకు పెద్ద ఎత్తున కాపులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో మిగులు సీట్లకు అడ్మిషన్లు

కదిరి అర్బన్: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగులు సీట్లకు అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎంఎస్ నారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రికల్, ఆటోమొబైల్ బ్రాంచ్‌లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7989327603 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు


పూజలు చేస్తున్న గురుస్వామి అంబటి సతీష్‌కుమార్

ధర్మవరం: పట్టణంలోని చెరువుకట్ట సమీపంలోని అయ్యప్పస్వామి భజన మందిరంలో ఆదివారం ఓనం పడి పూజను అయ్యప్ప మాలధారులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వామి అంబటి సతీష్‌కుమార్, ఓనం శిష్య బృందం అయ్యప్ప పాటలతో అందరినీ అలరించారు. అయ్యప్పస్వామిని వివిధ రకాల పూలతో అలంకరించి పడి పూజ చేశారు. అనంతరం భక్తులకు అయ్యప్పమాలధారులు అన్నదానం చేశారు.

బత్తలపల్లి ఇన్‌చార్జ్ ఎస్‌ఐగా ప్రదీప్‌కుమార్

బత్తలపల్లి: బత్తలపల్లి ఇన్‌చార్జ్ ఎస్‌ఐగా ప్రదీప్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న టీవీ శ్రీహర్ష సీఐగా పదోన్నతిపై వెళ్లారు. కాగా.. ప్రదీప్‌కుమార్ పోతుకుంట ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇసుక అక్రమ రవాణా, కర్ణాటక మద్యం, నిషేధిత గుట్కాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో ప్రశాంత వాతావరణం కల్పించేందుకు అందరూ సహకరించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌కు రావాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ముదిగుబ్బ: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రాజేంద్ర సూచించారు. ఆదివారం ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ.. దోమల వల్ల డెంగీ సోకుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి చుట్టు ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. డాక్టర్ రాజేంద్ర, డాక్టర్ లక్ష్మీనారాయణ, సీహెచ్‌ఓ సరస్వతమ్మ పాల్గొన్నారు.

ఐకమత్యంగా సమస్యలు పరిష్కరించుకుందాం


సమావేశంలో పాల్గొన్న రజకులు

ముదిగుబ్బ: రజకులంతా ఐకమత్యంగా ఉంటూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించుకుందామని రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణస్వామి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో రజకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రజకులు పడుతున్న ఇబ్బందులు, భవిష్యత్ ప్రణాళికపై చర్చించారు. కార్యక్రమంలో ఏపీ రజక అభివృద్ధి సంస్థ సెక్రటరీ జనరల్ కమ్మన్న, జిల్లా చైర్మెన్ సుబ్రమణ్యం, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సాయి శ్రీనివాసులు, జనార్దన్, స్థానిక నాయకులు లింగార్జున, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా పరిశీలన


సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ తిప్పేనాయక్

చెన్నేకొత్తపల్లి: ఓటరు జాబితాల పరిశీలన పారదర్శకంగా జరుగుతోందని ధర్మవరం ఆర్డీఓ తిప్పేనాయక్ తెలిపారు. ఆదివారం ఆయన మండలంలోని పులేటిపల్లి, చెన్నేకొత్తపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఓటరు జాబితా పరిశీలనను ఆయన తనిఖీ చేశారు. బీఎల్ఓలు చేస్తున్న సర్వేను ఆయన ఇంటింటికీ తిరిగి పరిశీలించారు. ప్రతి ఇల్లూ తిరిగి వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. ఓటర్లు ఉన్నరా, వేరే ప్రాంతానికి మారారా, ఎవరైనా చనిపోయారా, కొత్తగా ఓటు హక్కు వినియోగించుకునే వయస్సు వారు ఉన్నారా? తదితర వివరాలను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షాబుద్దీన్, బీఎల్ఓలు మహేష్‌రెడ్డి, లోకేష్ పాల్గొన్నారు.

25న పార్కింగ్ హక్కులకు వేలం

కదిరి అర్బన్: మండల పరిధిలోని యర్రదొడ్డి గంగమ్మ ఆలయంలో ఈనెల 25వ తేదీన వాహనాలు పార్కింగ్ చేసుకునే హక్కులకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ రామాంజినేయులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రూ.30 వేలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9493374914 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

పోతలయ్య స్వామికి ప్రత్యేక పూజలు

కనగానపల్లి: మండలంలోని దాదులూరు గ్రామంలో వెలసిన పోతలయ్యస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, స్వామివారికి బోనాలు సమర్పించారు. తర్వాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పోతలయ్య, చెన్నేకేశవస్వాములను దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని సౌకర్యాలు కల్పించారు.

మట్కాబీటర్ల అరెస్ట్

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని పాత ఊరు ప్రాంతంలో ఇద్దరు మట్కా బీటర్లను ఆదివారం రాత్రి అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.6000 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు చెప్పారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

సోమందేపల్లి: మండలంలోని మేకలపల్లి గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. నాగలూరు గ్రామానికి చెందిన ముత్యాలప్ప అనే వ్యక్తి 140 కర్ణాటక మద్యం ప్యాకెట్లు విక్రయించడానికి తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అతన్ని అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు. 140 మద్యం ప్యాకెట్లు సీజ్ చేశామన్నారు. ముత్యాలప్పను కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారని చెప్పారు.

పాము కాటుతో రైతుకు అస్వస్థత

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని ముచ్చురామి గ్రామానికి చెందిన నరసింహులు అనే రైతు ఆదివారం పాము కాటుతో అస్వస్థతకు గురయ్యాడు. వివరాలలో వెళ్లితే రైతు పశువుల మేత కోసం వ్యవసాయ పొలంలో గడ్డి కోస్తుండగా పాము కాటు వేసింది. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే అతడ్ని చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు.

మిత్రుడికి ఆపన్నహస్తం


నాగభూషణకు ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

నల్లచెరువు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మిత్రుడికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. ఈనెల 13వ తేదీన బత్రేపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గురోజివాండ్లపల్లికి చెందిన నాగభూషణ (సిద్దు) రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న 2003 బ్యాచ్ పదో తరగతి పూర్వపు విద్యార్థులు ఆదివారం మిత్రుడిని పరామర్శించారు. అనంతరం వైద్య చికిత్సల కోసం తమవంతు సాయంగా రూ.17 వేలు అందజేశారు. కార్యక్రమంలో చిలకల అమీర్, బావాజీ, అమరేంద్ర, ప్రకాష్ నాయుడు, రెడ్డెప్ప, హరి పాల్గొన్నారు.

కళ్లద్దాల పంపిణీ


కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ మదన్‌కుమార్


కదిరి టౌన్: పట్టణంలోని టవర్ క్లాక్ వద్ద ఉన్న రాణిపేట స్కూల్‌లో ఆదివారం శాంతిరామ్ మెడికల్ కాలేజ్ నంద్యాల వారి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు, చిన్న పిల్లల వైద్యుడు డాక్టర్ సీవీ.మదన్‌కుమార్ మాట్లాడుతూ.. కంటి జబ్బులతో బాధపడుతున్న వారిని నంద్యాల తీసుకెళ్లి, ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామన్నారు. ఇటీవల ఆపరేషన్లు చేయించుకున్న 50 మందికి కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో శాంతిరామ్ కాలేజీ సిబ్బంది, అడ్వకేట్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సీపీ కృష్ణమూర్తి, ఇంజినీర్ కొమ్ము భాస్కర్, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖాద్రీశుడికి వెండి వస్తువుల వితరణ


ఆలయ చైర్మన్‌కు వెండి బిందెలు అందజేస్తున్న దాతలు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామికి మొలకలచెరువుకు చెందిన బొంతల రమేష్‌బాబు దంపతులు, శ్రీలక్ష్మి కుటుంబ సభ్యులు ఆదివారం రెండు కేజీల విలువైన 2 వెండి బిందెలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి శేషవస్త్రం, శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య


భవాని మృతదేహం

నల్లచెరువు: మండల పరిధిలోని నల్లజోడు వారి పల్లిలో భవాని (20) అనే వివాహిత ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. నల్లజోడువారి పల్లికి చెందిన నరసింహులు కుమార్తె భవానీని సుబ్బరాయునిపల్లికి చెందిన అనిల్‌కు ఇచ్చి సంవత్సరం క్రితం వివాహం చేశారు. దంపతులిద్దరూ బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తూ జీవనం సాగించేవారు. అయితే గత కొద్ది కాలంగా భవాని తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ ఉండేది. రెండు రోజుల క్రితం దంపతులు బెంగళూరు నుంచి సుబ్బరాయునిపల్లికి వచ్చారు. ఆదివారం సాయంత్రం తన ఏడు నెలల పాపతో కలసి భవాని పుట్టినిల్లు అయిన నల్లజోడువారి పల్లికి చేరుకుంది. ఇప్పుడే వస్తానని చెప్పి పాపను పాపను సమీప బంధువులకు ఇచ్చి సమీపంలోని పొలాల్లోకి వెళ్లింది. భవాని ఎంత సేపటికి రాకపోవడంతో స్థానికులు పొలాల వద్దకు వెళ్లారు. అప్పటికే భవాని చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ షేక్షావలి తెలిపారు.

పోలీసుల అదుపులో దొంగలు

అమడగూరు: ఓడీచెరువు పోలీసులు ఇద్దరు దారిదోపిడీ దొంగలను పట్టుకుని విచారిస్తున్నారు. ఎస్‌ఐ గోపి తెలిపిన వివరాలు.. అమడగూరు మండలం కందుకూరిపల్లికి చెందిన పొగాకు జయరాం ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంలో తన సోదరిని ఎక్కించుకుని ఓడీచెరువులో వదిలి స్వగ్రామానికి బయలుదేరాడు. ఆకుతోటపల్లి సమీపంలోకి రాగానే ఇద్దరు దారిదోపిడీ దొంగలు జయరాంను ఆపి సెల్‌ఫోన్ లాక్కున్నారు. అలాగే అతడి వద్ద ఉన్న రూ.500 నగదు దోచుకుని ఉడాయించారు. భయాందోళనకు గురైన జయరాం గ్రామానికి వెళ్లి ఆకుతోటపల్లిలో ఉన్న బంధువులకు, స్నేహితులకు విషయాన్ని తెలియజేశారు. అప్రమత్తమైన గ్రామస్తులు గ్రామ చుట్టుపక్కల వెతికి దొంగలను పట్టుకుని స్టేషన్‌కు అప్పగించారు. దొంగలను విచారిస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నేడు ‘స్పందన’

బత్తలపల్లి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ యుగేశ్వరిదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. అదేవిధంగా మండలస్థాయిలో జరిగే స్పందన కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు కూడా ఏవైనా సమస్యలుంటే వినతిపత్రాలను అందజేయవచ్చన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు

అమడగూరు: మండలంలోని గుండువారిపల్లి బస్టాండ్‌లో ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. తనకల్లుకు చెందిన కృష్ణవేణి ద్విచక్ర వాహనంలో వేగంగా వెళ్తూ గుండువారిపల్లి బస్టాండ్‌లో బస్సు కోసం ఎదురుచూస్తున్న నల్లమాడ మండలం కొండ్రోల్లపల్లికి చెందిన రామాంజినమ్మను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో రామాంజినమ్మ కాలు విరిగిపోగా.. కృష్ణవేణికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు, పోలీసులు 108 వాహనంలో గాయపడిన ఇద్దరిని వైద్య చికిత్సల నిమిత్తం కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.